క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆరిలోవ : విమ్స్ సబ్ స్టేషన్ రెవెన్యూ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతుండడంతో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. దీని పరిధిలో విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, షిర్డీ సాయి వెటర్నరీ కాలనీ, చలపతినగర్, సంజీవినగర్, కైలాసగిరి రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మట్టి దిబ్బలతో ఇబ్బందులు



ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద రోడ్డుపై ఇసుక, మట్టి దిబ్బలు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డులో రోడ్లపై మట్టి దిబ్బలు స్థానికులకు ఇబ్బందిగా మారాయి. ఆరిలోవ ఆఖరి బస్టాప్, శివాజీనగర్ – 2లో రోడ్లు మట్టి దిబ్బలతో అస్తవ్యస్తమయ్యాయి. ముడసర్లోవ వెనుక ఏపీ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ నుంచి అండర్ గ్రౌండ్ విద్యుత్ పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు వార్డులో ఆఖరి బస్టాప్, శివాజీనగర్ మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డు స్కిల్ డెవలప్‌మెంట్ కూడలి వరకు జరుగుతున్నాయి. ఈ పనులు నత్తనడకన సాగడంతో సుమారు రెండు నెలల క్రితం తవ్విన గోతులు పూడ్చకుండా వదిలేశారు. పనుల కోసం తవ్విన గోతుల నుంచి తీసిన మట్టి దిబ్బలు రోడ్డు మధ్యలో వదిలేశారు. పనుల్లో భాగంగా తీసుకొచ్చిన ఇసుక నెలల తరబడి రోడ్డుపై దిబ్బలుగా వేసేశారు. ఈ దిబ్బలు స్థానికులు, వాహనచోదకుల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. పనులు తొందరగా జరిపించి రోడ్లు శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులను మంత్రముగ్ధులను చేయాలి



ఏయూలో ప్రసంగిస్తున్న గ్లెన్ హెడెన్

మద్దిలపాలెం : అధ్యాపకులు సమర్థవంతంగా సంభాషించాల్సిన చాతుర్యం అలవరచుకోవాలని ఆస్ట్రేలియాకు చెందిన అంతర్జాతీయ రంగస్థల ప్రముఖుడు గ్లెన్ హెడెన్ సూచించారు. ఏయూ విద్యా విభాగంలో 'టీచర్ యాజ్ ఏ పెర్ఫార్మర్' అనే అంశంపై గురువారం ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అధ్యాపకులు వారి డైనమిక్ పాత్రను హైలైట్ చేసుకుంటూ విద్యార్థులను మంత్రముగ్ధులను చేయాలన్నారు. తరగతి గది బోధనలో వాయిస్ మాడ్యులేషన్, బాడీ లాంగ్వేజ్‌తోపాటు కథ చెప్పడం ప్రాముఖ్యతను వివరించారు. విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారన్ రాజు, డాక్టర్ చల్లా క్రిష్ణవీర్ అభిషేక్ పాల్గొన్నారు.

రహదారిపైనే పార్కింగ్



హిందీ కాలేజీ వద్ద రహదారిపై వాహనాలు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో పలు చోట్ల ప్రధాన రహదారినే పార్కింగ్ ప్రాంతంగా వినియోగిస్తున్నారు. అంబేడ్కర్‌నగర్ కూడలి నుంచి దుర్గాబజార్ మీదుగా ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వరకు 30 అడుగుల ప్రధాన రహదారి ఉంది. ఈ రహదారిపై టి.ఐ.సి పాయింట్ సమీపంలో టిఫిన్ సెంటర్ల వద్ద సాయంత్రం సమయంలో రోడ్డుకు సగం వరకు మూసేసినట్లు వాహనాలు గంటలు తరబడి నిలిపేస్తున్నారు. దీంతోపాటు హిందీ కాలేజీ నుంచి పాత పోలీస్ స్టేషన్ వరకు రోడ్డుపైనే వ్యానులు, ఆటోలు నిత్యం నిలిపేస్తున్నారు. వీటి వల్ల సిటీ బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఇవి అడ్డుగా ఉండడంతో రోడ్డు పక్క నుంచి వెళ్లే పాదచారులకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హిందీ కాలేజీ ఎదురుగా నిలిపిన వ్యాను వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని ఓ విద్యార్థి ప్రమాదానికి గురై గాయాలపాలయ్యాడు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి రహదారిపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఎంవీపీ కాలనీ డబుల్‌రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపులు



ఏఎస్ రాజా మైదానం ఎదురుగా ఇరుకు రోడ్డుపై వింటేజ్ కంటైనర్ షాపు

ఫిర్యాదులపై ద్వంద్వ వైఖరి..!

- ఎంవీపీ, లాసన్స్ బే కాలనీల్లో ఇష్టారాజ్యంగా అక్రమ కట్టడాలు
- రోజురోజుకీ ఫుట్‌పాత్‌లపై పెరిగిపోతున్న దుకాణాలు
- ఫిర్యాదులపై కనీసం స్పందించని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, సిబ్బంది
- బిల్డర్స్‌తో కుమ్మక్కయ్యారని ఆరోపిస్తున్న ఫిర్యాదుదారులు



19వ వార్డ్ లాసన్స్ బే కాలనీ దరి ఇరుకురోడ్డు నిర్మాణంలో ఉన్న భవనానికి రంగులేసిన దృశ్యం

ఎంవీపీ కాలనీ : అక్రమ నిర్మాణాలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంలో జోన్ – 3 టౌన్ ప్లానింగ్ విభాగం అనుసరిస్తున్న తీరు నిత్యం విమర్శలపాలవుతోంది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) నుంచి సచివాలయ కార్యదర్శుల వరకు ఆ విభాగం ఉద్యోగులంతా ఫిర్యాదులపై ద్వంద్వ వైఖరి అవలంభిస్తుండడమే ఇందుకు కారణం. ఎంవీపీ కాలనీ, లాసన్స్ బే కాలనీ, శివాజీపాలెం, అప్పుఘర్, వెంకోజీపాలెం, పెదవాల్తేర్‌లలో పెద్ద ఎత్తున జరుగుతున్న అక్రమ కట్టడాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులను ఆ విభాగం కనీసం పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ ఆమోదించిన ప్లానింగ్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాల్సి వున్నా జోన్ – 3లో అది ఎక్కడా అమలు కావడం లేదు. చాలా నిర్మాణాలు కనీస అనుమతులు లేకుండా, ఇరుకు రోడ్లలో బహుళ అంతస్తులుగా జరుగుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఫుట్‌పాత్‌లను దాటి మరీ అనేక చోట్ల షాపులు పుట్టుకొస్తున్నా ఆ విభాగం కనీసం స్పందించడం లేదు. దీంతో ఏసీపీ నుంచి కార్యదర్శుల వరకు అంతా ఫిర్యాదులపై కాకుండా వసూళ్లపైనే దృష్టి సారిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సమస్య పరిష్కరించకుండానే ప్రత్యుత్తరాలు

అక్రమ నిర్మాణాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ ఏసీపీ మధుసుదన్‌రావు ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. పత్రికల్లో అక్రమ నిర్మాణాలపై వస్తున్న వార్తలను సైతం ఆయన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్పందనలో టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఇచ్చిన ఫిర్యాదులను 15 రోజుల్లో పరిష్కరించాలనే నిబంధన ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. 15 రోజులు దాటిన తర్వాత పలు ఫిర్యాదులను ఏసీపీ కార్యాలయంలో పరిష్కారం అయిపోయినట్లుగా ప్రభుత్వానికి చూపిస్తున్నారు. సమస్య పరిష్కరించినట్లు ఫిర్యాదుదారునికి ఉత్తర్వులు కూడా పంపిస్తుండటమే ఇందుకు నిదర్శనం. దీంతో సమస్య పరిష్కారం కాకుండానే అయిపోయినట్లుగా ఎలా ప్రత్యుత్తరాలు పంపిస్తారంటూ ఫిర్యాదుదారులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేకున్నా ఏసీపీ మధుసుధన్‌రావు అధికారుల వద్ద మెప్పు పొందేందుకు ఈ మోసపూరిత విధానాన్ని అవలంబిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఈ వ్యవహారంపై ఏసీపీని పలువురు ఫిర్యాదుదారులు నిలదీయడంతో త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని చెప్పడం గమనార్హం. 15 రోజుల్లో ఆన్‌లైన్ ఫిర్యాదు క్లోజ్ చేయకుంటే అధికారుల నుంచి ఒత్తిడి ఉంటుందని, అందుకే అలా చేస్తున్నామని ఆయన పేర్కొనడంపై ఫిర్యాదుదారులు మండిపడుతున్నారు. ఓ ఫిర్యాదుదారుడితో ఏసీపీ మధుసుదన్‌రావు ఈ తరహాలో చేసిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లో ఇరుకు రోడ్డులో నిర్మిస్తున్న భవనం



ఎంవీపీ సెక్టార్ – 6 బుద్ధవనం ఎదుట నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

ఎంవీపీ కాలనీ, లాసన్స్ బే కాలనీ, పెదవాల్తేర్ పరిధిలోని పలు వార్డుల్లో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు, ఫుట్‌పాత్‌లు దాటి షాపుల నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జీవీఎంసీ 19వ వార్డు లాసన్స్ బే కాలనీలో 10 అడుగులు కూడా లేని రోడ్డు మార్గంలో బహుళ అంతస్తుల భవనం నిర్మించేశారు. ఈ నిర్మాణం సీఆర్‌జెడ్ పరిధిలో జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ విభాగం కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు అందినా పట్టించుకోవడం లేదు. 17వ వార్డు ఇందిరా నగర్ గ్రీన్ బెల్ట్‌లో బహుళ అంతస్తుల శాశ్వత నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆయా నిర్మాణాలు అడ్డుకోవాలని స్థానిక కాలనీ వాసులు టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేదు. 18వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లో ఇరుకు రోడ్లలో బహుళ అంతస్తుల నిర్మాణం సాగుతోంది. బుద్ధవనం ఎదురుగా ఓ బిల్డర్ నిబంధనలకు విరుద్ధంగా వరస నిర్మాణాలు చేపట్టినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. అయితే వాటిపై చర్యలు తీసుకోవాల్సిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం ఎన్ని ఫిర్యాదులు అందుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఆ విభాగ ఉన్నతాధికారులు, స్థానిక టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు పలువురు బిల్డర్లతో కుమ్మక్కవుతున్న కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని ఫిర్యాదుదారులు వెల్లడిస్తున్నారు. శివాజీపాలెం రోడ్డు, శివాజీపార్క్‌తోపాటు ఎంవీపీ డబుల్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై అందిన ఫిర్యాదులపై అధికారులు కనీసం చర్యలు తీసుకోలేదు. ఏఎస్‌రాజా మైదానం ఎదురుగా ఇటీవల ఓ వ్యాపారి ఏకంగా కంటైనర్ షాపును ఫుట్‌పాత్‌ను దాటి ఇరుకురోడ్డులో పెట్టేయడం సమస్యాత్మకంగా మారింది. దీనిపై సైతం టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోలేదు.

వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుల నియామకం



ఆరిలోవ : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖపట్నం తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ వార్డు అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.

తూర్పు వార్డు అధ్యక్షులు వీరే..

జరజాపు నీరజ్‌కుమార్ (9వ వార్డు), పతివాడ కనకరాజ్ (10వ వార్డు), ముగడ రమేష్ (11వ వార్డు), సత్యాల వేంకటేశ్వర్ (13వ వార్డు), కణితి మరియదాస్ (15వ వార్డు), చొల్లంగి నాగేశ్వరరావు (16వ వార్డు), పాలికల నీల్‌రెడ్డి (17వ వార్డు), ఉమ్మిడి కల్యాణ్ (18వ వార్డు), యనమరెడ్డి కుమార్‌రెడ్డి (20వ వార్డు), మధుపాడ రవికుమార్ (21వ వార్డు), పీతల గోవింద్ (22వ వార్డు), బోస రమణారెడ్డి (23వ వార్డు), రేపాక శ్రీనివాసరావు (28వ వార్డు).

అనుబంధ సంఘాల అధ్యక్షులు వీరే..

తూర్పు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా కాగితాల రవికిరణ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు చిందాడ శ్రీనివాసరావు, స్టూడెంట్ విభాగానికి పిలక తరుణ్ రెడ్డి, మున్సిపల్ విభాగానికి వైదా నారాయణరావు, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా మద్ది వెంకటరావు, గ్రీవెన్స్ సెల్‌కు పీలా జోషిల, వాణిజ్య విభాగానికి నమ్మి లవణకుమార్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా కాగితాల వెంకటరమణ, కల్చరల్ వింగ్‌కు పిలకా మధుసూదనరెడ్డి, సోషల్ మీడియా వింగ్‌కు నాగిరెడ్డి పోలిశెట్టి, ఐటీ విభాగానికి బొడ్డేటి వేణుగోపాల్, బూత్ కమిటీకి కోన కామేష్, ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడిగా ఎండ్రెడ్ల ఈశ్వర్‌రెడ్డిని నియమించారు.

అందరూ స్వచ్ఛభారత్‌లో పాల్గొనాలి

మద్దిలపాలెం : ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వచ్ఛభారత్‌లో పాల్గొనాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ సూచించారు. డాక్టర్ వి.ఎస్.క్రిష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. మాధవ్ పాల్గొని కళాశాల మైదానం, ఇతర ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్ర భారతావనిని సాధించడమే లక్ష్యంగా ×స్వచ్ఛ భారత్×ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయ బాబు, డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, డాక్టర్ జీవీ ప్రతాప్, ఎం.బాలక్రిష్ణ, ఎం.శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలి



హెచ్‌బీ కాలనీలో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, ఆటో డ్రైవర్లు

మద్దిలపాలెం : కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవిందు డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా వెంకోజీపాలెం ఆంజనేయస్వామి విగ్రహం వరకు ఆటోలతో డ్రైవర్లు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం వాహన మిత్ర అమలుతోపాటు, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి సంవత్సర కాలం దాటిపోయినా పథకాలు అమలు చేయలేదన్నారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్నామన్నారు. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు జీవో. 21, 31 జారీ చేసిన ప్రభుత్వం డ్రైవర్లపై అక్రమ కేసులు బనాయిస్తూ వాహనాలను సీజ్ చేయించడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు అడ్డూరు శంకర్, ఎన్.మధు రెడ్డి, లంక గోవింద్, పి.క్రిష్ణం నాయుడు, శ్రీను, దల్లి నాని, ఎం.సింహాచలం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గోతులు



ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుపై గొయ్యి

ఆరిలోవ : జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధిలో ప్రధాన రహదారి పలుచోట్ల గోతులమయమైంది. టీఐసీ పాయింట్ బ్రిలియంట్ స్కూల్ ముందు మ్యాన్ హోల్ వద్ద గొయ్యి నిత్యం వాహనచోదకులను ప్రమాదాలకు గురి చేస్తోంది. పాత పోలీస్ స్టేషన్ ముందు ఒకే చోట రెండు గోతులు ప్రమాదకరంగా మారాయి. పెద్ద గోతులు కావడంతో ద్విచక్ర వాహనచోదకులు ఇక్కడ నిత్యం పడిపోతున్నారు. రాత్రి వేళల్లో చీకటి కావడంతో ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు అంటున్నారు. ఇక్కడ ఆటోలు, ద్విచక్ర వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. ఈ గోతులను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



20వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు



జీవీఎంసీ 13వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

- ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు మేనిఫెస్టో
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్డు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరు కమ్యూనిటీ హాలులో వార్డు ఇన్‌చార్జి మువ్వల సురేష్ అధ్యక్షతన, కార్పొరేటర్ మువ్వల లక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు గడప గడపకు వెళ్లి చాలా హామీలిచ్చారని గుర్తు చేశారు. ష్యూరిటీగా బాండ్లు ఇస్తున్నామని నమ్మించి ప్రజలను మోసం చేశారన్నారు. ఈ కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలందరికీ తెలియజేయాలనే ఉద్దేశ్యంతో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రజలందరినీ చైతన్యవంతులను చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రవికిరణ్ రెడ్డి, మద్ది పోలిరెడ్డి, దువ్వి గోవింద, యనమరెడ్డి రమణారెడ్డి, కాగితాల లక్ష్మణరెడ్డి, కాగితాల రమణరెడ్డి, మాదు మంగరాజు, పిలక తరుణ్ రెడ్డి, రాము, మద్ది రమణరెడ్డి, వాసు, రాంబాబు, రమణమ్మ, బంటు, సంధ్య, దాసరి మంగరాజు, నళిని పాల్గొన్నారు.

హామీలన్నీ గాలికొదిలేశారు

'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' అనే నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు కోరారు. జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవలో వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ అధ్యక్షతన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ మేనిఫెస్టోలో చెప్పిన హామీలను గాలికి వదిలేశారన్నారు. ఇంటింటికీ వెళ్లి జనం బ్యాంకు ఖాతాలో లక్షలాది రూపాయలు జమ చేస్తామని నమ్మించి ఓట్లు దండుకున్నారని విమర్శించారు.

కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, నియోజకవర్గం మహిళ విభాగం అధ్యక్షురాలు శిరీష, జాన్ విక్టర్, సత్యాల సాగరిక, ప్రసంగి వాసు, బెవర జగదీశ్, వానపల్లి ఈశ్వరరావు, దుర్గారావు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదు తరగతులకు... నలుగురే ఉపాధ్యాయులు..!



నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి బోధిస్తున్న ఉపాధ్యాయుడు



జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి భగత్‌సింగ్ నగర్ ప్రాథమిక పాఠశాల

- భగత్‌సింగ్ నగర్ స్కూల్‌లో టీచర్ల కొరతతో విద్యార్థులకు ఇబ్బందులు
- 'నాడు – నేడు'తో సౌకర్యాలు కల్పించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ప్రస్తుతం సరిపడా ఉపాధ్యాయులను నియమించని కూటమి పాలకులు
- రెండేసి తరగతుల విద్యార్థులకు ఒకే గదిలో బోధన

ఆరిలోవ : పాఠశాలలో సౌకర్యాలన్నీ ఉన్నా... సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. 'అన్నీ ఉన్నా అసలు సున్నా' అన్న చందంగా మారింది ఆ ప్రభుత్వ పాఠశాల పరిస్థితి. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి భగత్‌సింగ్‌నగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 136 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి బోధించడానికి నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. సాధారణంగా నాణ్యమైన విద్యాబోధన అందించడానికి ఒక ప్రధానోపాధ్యాయుడుతోపాటు తరగతికి ఒకరు చొప్పున ఉపాధ్యాయులు ఉండాలి. ఈ లెక్క ప్రకారం ఇక్కడ హెచ్‌ఎంతో సహా ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాలి. గత విద్యా సంవత్సరం వరకు ఇక్కడ ఆరుగురు ఉపాధ్యాయులు ఉండేవారు. వారిలో ఆరు నెలల క్రితం ఒకరు ఉద్యోగ విరమణ పొందారు. ఇక్కడ పనిచేసిన ప్రధానోపాధ్యాయురాలు లాంగ్ లీవ్‌పై అమెరికా వెళ్లారు. ప్రస్తుతం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే మిగిలారు. గత ఏడాది 142 మందిలో 26 మంది ఐదో తరగతి విద్యార్థులు రిలీవ్ కాగా ఇప్పుడు కొత్తగా 20 మంది మాత్రమే చేరారు. దీంతో ప్రస్తుతం 136 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులే ఉన్నారు. వారిలో వారంలో ఒకరైనా సాధారణంగా సెలవు పెడుతున్నారు. దీంతో రెండేసి తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోపెట్టి బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. రోజూ ఇక్కడ ఇదే సమస్యతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఉన్న నలుగురిలో ఓ ఉపాధ్యాయుడు మరో నాలుగు నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. అప్పుడు ఇక్కడ ముగ్గురితో మమా అనిపించాల్సిన పరిస్థితి రానుంది.

స్కూల్‌లో సౌకర్యాలు ఫుల్..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'నాడు – నేడు' పథకం కింద భగత్‌సింగ్ నగర్‌లోని పాఠశాలలో సౌకర్యాలు కల్పించింది. ఆ సౌకర్యాలను వినియోగించుకోవడంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో 'నాడు – నేడు' కింద ఇక్కడ మరో అంతస్తు నిర్మించి దానిలో అదనంగా రెండు గదులు నిర్మించారు. ఆ గదుల్లో తరగతులు నిర్వహించడానికి అవసరమైన ఉపాధ్యాయులు లేరు. దీంతో ఆ గదులు నిరుపయోగంగా మిగిలాయి. దీంతోపాటు బాలికలకు, బాలురకు వేర్వేరుగా మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా వేదిక నిర్మించారు. ఇవన్నీ ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అవసరమైనంత మంది ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందించలేకపోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యా శాఖాధికారులు స్పందించి ఈ పాఠశాలకు అవసరమైనంత మంది ఉపాధ్యాయులను నియమించాలని పలువురు కోరుతున్నారు.

ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మాధవ్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

మద్దిలపాలెం : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్‌కు ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్, ఏయూ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కోడి అర్జునుడు కోరారు. ఈ మేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు సమస్యలను కోడి అర్జునుడు, పల్లవి వివరించారు. హైకోర్టు తీర్పును ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టైం స్కేల్ అమలు చేయమని జనవరిలో జీవో నంబర్ 2 విడుదల చేస్తే అమలు చేయకపోగా కొత్తగా అగ్రిమెంట్ ఆఫ్ కాంట్రాక్ట్ సర్వీస్ పేరుతో ఉద్యోగాలకు భద్రత లేకుండా చేశారని వాపోయారు. వీటిపై మాధవ్ స్పందిస్తూ ఒప్పంద ఆచార్యుల సమస్యపై ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. వుండ్రుకొండ హరీష్, బోరుగడ్డ సుబ్బయ్య, కొండపల్లి రతన్‌రాజు, మోకా రతన్‌రాజు, సీతామహాలక్ష్మి, మని శేఖర్, సుబ్బతాత, దొరబాబు, బి.లక్ష్మణ్ పాల్గొన్నారు

బంగారం చోరీపై కేసు

ఎంవీపీ కాలనీ : లాసన్స్ బే కాలనీలోని ఎల్‌బీ లాడ్జిలో బంగారం చోరీపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన పి.కృష్ణ (30) తన చెల్లెలు పెళ్లి నిమిత్తం ఫ్యామిలీతో జూన్ 1న విశాఖ వచ్చాడు. జూన్ 2న ఉదయం కుటుంబంతో కలిసి సింహాచలం దర్శనానికి వెళ్లాడు. తిరిగి లాడ్జికి వచ్చి రూమ్‌లో చూసేసరికి 3 తులాల విలువ గల రెండు బంగారు చైన్లు కనిపించ లేదు. దీంతో లాడ్జి మేనేజ్‌మెంట్‌కు విషయం తెలియజేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో గురువారం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.